భావ వీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 14 Issue No. 11 (1) Monthly November 2017 ISSN No. : 2456-4702



Contents (విషయ సూచిక)

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (1), November-2017,
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

విశాఖ ఏజెన్సీ కోదు తెగ ప్రజలు - వివాహ సంప్రదాయం

- పెనుమాక రాజశేఖర్
జె.ఆర్.ఎఫ్. స్కాలర్, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

- డా॥ ఎన్.వి. కృష్ణారావు,
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

అనాది కాలం నుండి అరణ్యంలోనే జీవిస్తూ, అడవి తల్లినే అమ్మ ఒడిగా భావిస్తూ, ప్రకృతినే పరమ దైవంగా పూజిస్తూ, అరణ్యఫలాలనే ఆహారంగా భుజిస్తూ, బ్రతుకు బండిని భారంగా ఈడుస్తూ, అభివృద్ధికి అమడ దూరంలో కొండకోనల్లో నివసిస్తున్నవారు గిరిజనులు. వీరినే ఆదిమజాతి మానవులు, షెడ్యూల్డ్ తెగ ప్రజలు అని వివిధ రకాల పేర్లతో కూడా పిలుస్తున్నారు.

ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో గిరిజనులు నివసిస్తున్నట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో పాడేరును కేంద్రంగా కలిగిన అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట, పాడేరు, పెదబయలు, ముంచింగి పుట్టు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, అనే 11 మండలాల్లో కూడా వివిధ రకాల పేర్లతో పిలువబడే గిరిజనులు నివసిస్తున్నారు. వీరిలో కోదు తెగ ప్రజలు ఒకరు. ఈ తెగ ప్రజల జీవన సంస్కృతిలో భాగమైన వివాహ సంప్రదాయాన్ని గూర్చి తెలియజేయుటమే ప్రస్తుత వ్యాసోద్దేశం.

కోదు ప్రజల - సంక్షిప్త సమాచారం :

విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో అత్యంత వెనుకబడిన తెగలలో కోదు తెగ ఒకటి. వీరిని కోందు, కువి, కులు, సామంత, కోదు, జాతపు దొర కొది, కొయింగా, అనే మొదలైన పేర్లతో పిలుస్తున్నారు. ఈ తెగ ప్రజలు మాట్లాడే మాండలిక భాషను 'కువి' అని పిలుస్తారు. దీనికి లిపి లేదు.

ఈ తెగ ప్రజలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలో ఎక్కువగా ఉన్నారు. వీరిలో కొంతమంది 'తెలుగు'ను మాతృభాషగా కూడా కలిగి వున్నారు. వీరు తమ జీవనమును దాదాపు పర్వత పాదాల వద్ద లేదా పర్వతాలపై గడుపుతారు. వీరి జీవనశైలి వైవిధ్యభరితంగా ఉంటుంది. ఈ కోదు తెగలల్లో డోగ్రిమా కోదు, దేషియ కోదు కుట్టియా కోదు, ఎసటికోద్ అనే ఉపతెగలున్నాయి. వీరి జీవనాధారం వ్యవసాయం. చేపలు పట్టడం వీరికి ఇష్టమైన అలవాటు. వీరి సామాజిక జీవనలో 'గిరిజన పెద్దల సమితి'లు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. వీరి పండుగల్లో జోళ్ల, కొత్త కొత్త సంకురాతిరి, ముఖ్యమైనవి. కోదు ప్రజలు ప్రదర్శించే ధింసా, మయూరి నృత్యాలకు జాతీయ స్థాయిలో ప్రముఖ గుర్తింపుకలదు.

వివాహం - ప్రాధాన్యత :

మానవ జీవితయానంలో వివాహం అత్యంత ప్రాముఖ్యమైన మజిలి కుటుంబ వ్యవస్థకు పునాది పెళ్ళి. సృష్టిలోని సమస్త జీవులకు లైంగిక వాంఛలున్నాయి. ఈ లైంగిక వాంఛయే సమస్త జీవకోటి జీవోత్పత్తికి మూలం. ఆదిమ మానవునికి సంయోగ వాంఛ తీర్చుకోవడానికి ఏ నిబంధనలు, కట్టుబాట్లు ఉండేవి కావు. కాని కాలక్రమంలో విజ్ఞానం వికసించి, సంయోగ ప్రవృత్తిని, చక్కని మార్గంలో నడపడానికి మానవుడు సామూహిక సమ్మతిచే వివాహ వ్యవస్థకు శ్రీకారం చుట్టాడు. మానవజాతి మనుగడకు, మానవ సమాజ నిర్మాణంకు కుటుంబ వ్యవస్థ ఏర్పడడానికి ఇది మహోజ్వల ఘట్టం.

సమాజ ఆమోద ముద్రచే ఏర్పడిన స్త్రీ, పురుషుల సంయోగం పెళ్ళి అని చెప్పవచ్చు. ఈ పెళ్ళి లైంగిక వాంఛల్ని తీర్చుతూ, సంతానోత్పత్తికి కారణం అవుతూ కుటుంబ వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ పెళ్ళి జరిగే తీరు వివిధ మతాలను బట్టి, వివిధ కులాలను బట్టి వివిధ వర్గాలను బట్టి వివిధ రకాలుగా వుంటుంది.

కోదు తెగ ప్రజల వివాహ సాంప్రదాయం :

కోదు తెగ ప్రజల్లో కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు చాలా ఎక్కువ. ఈ జాతి ప్రజల వివాహ తీరు ఎంతో భిన్నంగా వుంటుంది. అంటే వీరి వివాహ నియమ నిబంధనలు, విడిపోవడానికి అనుసరించే పద్ధతులు, సమకాలీన నాగరిక సమాజంతో పోలిస్తే వేరుగా ఉంటాయి. వీరి వివాహ సాంప్రదాయం క్రింది పేర్కొన్న క్రమంలో వుంటుంది.

(అ) వివాహం జరిగే పద్ధతులు :

1. తల్లిదండ్రులు ఏర్పాటు చేసినా లేదా కుదిర్చిన వివాహం
2. కుండమార్పిడి పెళ్ళిళ్ళు
3. కన్యను ధనం చెల్లించి కొనుక్కోవడం
4. సేవచేసి వివాహమాడటం
5. కన్యను అపహరించి వివాహం చేసుకోవడం
6. పరీక్షల ద్వారా వివాహం (స్వయంవరం వలె)
7. లేచిపోయి వివాహం చేసుకోవడం

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (1), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

(ఆ) పెళ్ళిచూపులు :

అన్ని జాతుల వారికి ఉన్నట్లుగానే వివాహానికి ముందు జరిగే పెళ్ళిచూపులు కోదు ప్రజలలో కూడా ఉన్నాయి. వీరు అమ్మాయిని అడుగుటకు వాళ్ళ ఇంటికి వెళ్ళేటపుడు పెండ్లి కుమారుని తరఫువారు మూడు సీసాల (దాదాపు మూడు లీటర్లు) మద్యం తీసుకువెళతారు. ఇరుపక్షాల వారు అంగీకరిస్తే మరల ఆరు నెలల తర్వాత ఒక సీసా మద్యాన్ని పెళ్ళి కుమారుని తరఫువారు తీసుకువెళతారు. అక్కడ పెళ్ళి విషయాలు మాట్లాడుకుంటారు. అందరికీ ఇష్టం అయితే పెళ్ళి ఎప్పుడు చేయాలో నిర్ణయించుకుంటారు.

(ఇ) పెళ్ళి కుమార్తెను తీసుకురావటం :

కోదు తెగ ప్రజల పెళ్ళి పెండ్లి కుమారుని ఇంటి దగ్గర జరుగుతుంది. పెండ్లి కుమారుని తరఫువారు పెళ్ళి కుమార్తె వారికి ఒక మేక, ఒక చీర, 5 డబ్బాల బియ్యం (25 కిలోలు), ఒక సీసా మద్యం, రెండు కుండాల పప్పు, రెండు గుమ్మడి కాయలు ఇవ్వాలి. వీటిలో చీరను పెండ్లి కుమార్తె తల్లికి ఇస్తారు. మిగతా వాటితో గ్రామస్తులు విందు చేసుకుంటారు. కోదు తెగ ప్రజల వివాహంలో వరకట్నం అనేది దాదాపుగా వుండేది కాదు. కానీ నేటి కాలంలో అక్కడక్కడ కనిపిస్తుంది.

విందు అనంతరం పెళ్ళి కూతురిని గ్రామంలోని అన్ని ఇళ్ళకు తీసుకువెళతారు. అలా వెళ్ళినప్పుడు ఎవరికి తోచిన మేరకు వారు బహుమానాలు ఇస్తారు. అనంతరం పెళ్ళి కుమార్తె గ్రామ పెద్ద, పెండ్లి కుమారుని గ్రామ పెద్దకు పెళ్ళికూతురిని అప్పచెపుతారు.

అత్త వారింటికి కాలుపెట్టె ముందు గ్రామ పొలిమేరల్లో రాహు, కేతు దోషాలను తొలగించుటకు గురుమాయి (మంత్రసాని) పూజలు చేస్తుంది. పూజ అనంతరం వధూవరులుపై అక్షింతలు జల్లుతారు అలా జల్లిన అక్షింతలు కోడికి వేస్తారు. కోడి, వాటిని తింటే వారి సంసారం సాఫీగా జరుగుతుంది. లేదంటే సాఫీగా జరగదని నమ్ముతారు.

(ఈ) పెళ్ళి జరిగే తీరు :

పెళ్ళి కుమార్తెను తీసుకువచ్చిన తర్వాత రోజున వేకువ జామునే నిర్ణయించిన ముహూర్తం ప్రకారం తొగరి నీళ్ళను (ఉదయాన్నే బావిలో పక్షులు గాని, మనుషులు గాని ముట్టని నీళ్ళు) బాజా భజంత్రులతో తెచ్చి ఇద్దరికి స్నానం చేయించి, తర్వాత కొత్త బట్టలు వేసి, పెళ్ళి పీటలపై కూర్చోపెడతారు. దిశరి(పూజారి) దాదాపు 3 గంటల సమయం పూజలు నిర్వహించి మంగళసూత్రం కట్టించి, పెళ్ళి జరిపిస్తారు. పెళ్ళి జరిగిన తర్వాతే వధువును వరుడు తన ఇంటికి తీసుకు వెళతారు. మొదటి రాత్రి చేసేందుకు ప్రత్యేక కార్యాలు ఏమి చేయరు.

(ఉ) వంటకు ముహూర్తం :

పెళ్ళి కుమారుని ఇంటికి వచ్చిన తర్వాత కూడా వెంటనే వంటలు చేయుటకు వీలు లేదు. దిశరి మరల ముహూర్తం నిర్ణయించి ఏ రోజు నుండి వంటలు చేయవచ్చునో చెప్పిన తర్వాత మాత్రమే వంటలు చేయాలి. అంతవరకు వంట చేయకూడదు. ఇల్లు తుడవటం, నీరు తీసుకురావడం, తదితర ఇంటి పనులను మాత్రమే చేయవలసి వుంటుంది.

పిల్లలు పుట్టడం - నామకరణం :

మానవ జీవన యాత్రలో మొదటిది పుట్టుక. ఈ పుట్టుకకు సంబంధించిన ఆచారాలు ప్రపంచంలోని ప్రతి మానవ సమాజంలో అనేక విధాలుగా కన్పిస్తాయి. అదే విధంగా కోదు ప్రజల వ్యవహారాలలో కూడా ఈ పుట్టుకకు సంబంధించిన అనేక ఆచారాలు అమలులో ఉన్నాయి.

కోదు ప్రజలు పిల్లలు పుట్టిన రోజున 'బొడ్డు దోషం' అనే కార్యక్రమాన్ని చేస్తారు. బొడ్డు దోషం అనగా పిల్లలు పుట్టిన రోజున బిడ్డ పేగును దారంతో కట్టి బాణంతో పేగును బొడ్డుబుడ్డి (బొడ్డు కోసే కోదు మునలి మహిళ) కోస్తుంది. ఆ బొడ్డు కోయుటకు ముందుగా పూజలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని 'గురుమాయి' చేస్తుంది. ఈ పూజలు చేసినందుకు ఆమెకు ఒక కోడి, ఒక సీసా మద్యం, కొంత బియ్యం, ఒక చీర ఇస్తారు. అలా కోసిన బొడ్డును ఒక ప్రాంతంలో గొయ్యి తీసి పాతిపెట్టి దానిపై ఒక కుండను పెడతారు. తొమ్మిది రోజులు గడిచిన తరువాత బిడ్డ తల్లిని అక్కడకు తీసుకువెళ్ళి స్నానం చేయిస్తారు. ఆ రోజుతో ఆ ఇంటికి గల మైల పోతుంది. ఈ మైలు ఉన్నంతకాలం ఆ ఇంటికి గ్రామంలోని ప్రజలు గాని, లేదా స్వంత చుట్టాలు గాని, వెళ్ళడం గాని, ముట్టుకోవడం గాని, వారితో కలసి భోజనం చేయడం గాని చేయరు.

కోదు ప్రజలు బొడ్డు దోషం ముగిసిన తర్వాత పిల్లలకు నామకరణం చేస్తారు. ఈ నామకరణం విచిత్రంగా వుంటుంది. ఈ తెగవారు పిల్లలకు పేర్లను వారు పుట్టిన రోజున బట్టి నిర్ణయిస్తారు.

ఆదివారం జన్మిస్తే అమ్మాయికి 'వార్కో' అని, అబ్బాయికి 'వారో' అని పెడతారు.

సోమవారం జన్మిస్తే అమ్మాయికి 'సోమెల' అని, అబ్బాయికి 'సోమర' అని పెడతారు.

మంగళవారం జన్మిస్తే అమ్మాయికి 'మంగ్లి' అని, అబ్బాయికి 'మంగేలి' అని పెడతారు.

బుధవారం జన్మిస్తే అమ్మాయికి 'బుద్ధి' అని, అబ్బాయికి 'బుద్ధుడు' అని పెడతారు.

లక్ష్మి(గురు)వారం జన్మిస్తే అమ్మాయికి 'లచ్చిమి' అని, అబ్బాయికి 'లచ్చుడు' అని పెడతారు.

BHAVAVEENA
Vol. 14, Issue. 11 (1), November-2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

శుక్రవారమైతే అమ్మాయికి 'సుక్రి' అని, అబ్బాయికి 'సుక్ర' అని పెడతారు.

శనివారమైతే అమ్మాయికి 'సోని' అని, అబ్బాయికి 'సోనా' అని నామకరణం చేస్తారు.

అయితే ప్రస్తుతం ఈ కోదు ప్రజలలో కొంతమంది అక్షరాస్యులై వివిధ నాగరిక ప్రజలతో కలిసి జీవించడం వల్ల వీరు కూడా తమ ఆచార సంప్రదాయాలలో మార్పును ఆశిస్తూ, ఈ విధంగా పేర్లను పెట్టడం కొంత అనాగరికంగా భావించి, దీనిని కొంతవరకు ప్రక్కన పెట్టి, ఆధునాతన పేర్లను పెడుతున్నారు.

ఉపసంహారం :

ఈ విధంగా ప్రాచీనకాలం నుండి తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన సంస్కృతి సాంప్రదాయాలలో భాగమైన వివాహ సాంప్రదాయాన్ని నేటి ప్రపంచీకరణ కాలంలో కూడా కోదు తెగ ప్రజలు కాపాడుకొంటూ వస్తున్నారు. వీరి సాంప్రదాయంలో వరకట్నం ప్రసక్తి లేకపోవడం ఇంకా ఉమ్మడి కుటుంబాలను కలిగి వుండడం నవనాగరికుడిగా చెప్పబడుతున్న నేటి తరానికి గొప్ప ఆదర్శంగా ఉన్నాయి.